నరపాలుమంత్రులు నాతి కిట్లనిరి.
' చిత్రాంగి, నీ వింత సేమాన నుంటి,
పుత్త్రునిపై నింద పుట్టె నీలాగు.
పున్నెమో పాపమో భూదేవి కెఱుక,
వన్నెగా నాకాశవాణికిఁ దెలియు.
మనుజు లెంతటివారు? మాటలయందు
ననుమాన మేర్పడు? నందాఁక నేమి
యనరాదు. జనపాలు ననుమతిచేతఁ
జని మేము నిందాఁక సారంగధరుని
నడిగిన సొంపుగ మాటఁ జెన్నినాఁడు.
దుడుకు సేయఁగరాదు దూరంబు సూడు,
నళినాక్షి, పెఱవారి నాశంబు సేయఁ
దలఁచినఁ దనమేలు దైవంబు చెఱుచు.
మొనసి కట్టినతిప్పు మోయుటకొఱకు
ననిత, యెవ్వరిమీఁద వచ్చునో కాని?
వేవే లనఁగ నేల? వినుము చిత్రాంగి
దేవి, తెన్నగ మీరు చెప్పక యున్న
సామ దండోపాయ సాధనంబులను
దీమసంబున జాడ దీయక పోరు.
బయలైనవెనుక నీప్రజలలోపలను
బయిసి పోస్రుట కొంత, పాపంబు కొంత,
ఆడిక లౌక కొంత, యపకీర్తి కొంత,
చేకగా, తగుబుద్ధి చెప్పితి' మనిన;—

చిఱుపాల బూరుగు చిల్ల చెన్నంగి
కుఱుముష్టియును గొండగోఁగు వాకలివె
బలుసు ముల్ మోదుగు పచ్చారె యారె
వలిచంద్ర ములుచంద్ర వాడగన్నేరు
నలదుమ్మ పొగడ పున్నాగవృక్షములు
గలిగిన చీఁకటి కానలోపలను,
గొబ్బునఁ జెట్లెక్కి గూబలు గూయ,
గబ్బిలంబులు లేఁతకారాకు మేయ,
తీతువపిట్టలు తెవ్రలుగాఁ గూయఁ,
గోఁతులు బెదరి వాల్కొమ్మలు ద్రొక్క,
మండ్రాటముగ నిఱ్ఱిమాంసంబు మెసవి
గాండ్రపెట్టెడు పెద్దగండుమెకాలు,
గరుపనేలలఁ దుంగగడ్డలు ద్రవ్వి
గుఱుగుఱు మను పందిగున్నలబార్లు,
చెదఁద్రవ్వి పుట్టలఁ జెద లంటఁ బీల్చి
యెడ బొమ్మ లిడుకొండ యెలుఁగుమొత్తములు,
కరులతుండములతోఁ గదిసి పోరాడి
విఱిసి ఘీంకృతులతో వెన్నాడుకరులు,
గుఱుశిలామయ మగు కోనలోపలను
వెరవునఁ జొచ్చిరి వేగంబె వారు.

—* తలవరులు రాసుతుని కాలుసేతులు నఱుకుట *—

వయినంబుగా నట వనమెల్లఁ గాలి
బయ లైనయొక పెద్ద బండపై నెక్కి

కన రెక్కి యంత ముష్కరము సేయంగఁ
బొసఁగించి మొగవేయ బొంకనీ కెంత!
ముంగల వెనుక నీ మూఁడులోకముల
నంగన, నీయంత యాఁడుది లేదు.'
అని అంతు చేసి రాజాస్థాన మెల్ల
వినఁ జెప్పి యెప్పటి విధమున నుండె.
నప్పుడు నరపతి యఖిలబంధువులు
నె మ్మైనయాప్తులు నుచితమంత్రులును
దొరలు సామంతులు దుర్గాధిపతులుఁ
బరివారమును బురప్రజ యాదిగాను
విన్నవా రందఱు విస్మయం బంది,
చె న్నొప్పఁ జిత్రాంగి చేసినతప్పు
1 బయలు చెప్పఁగ గుట్టు బయలాయె ననుచు
జయ వెట్టగాఁ, జూచి జనవల్లభుండు
శోకంబు కోపంబు సొద వేర్చినట్టు
లాఁకొన్నపులివలె నాగ్రహంబునను
గోలాహలంబుగాఁ గొలు వెల్లఁ జెదరఁ
గాలాగ్నిరుద్రుని కరణి మండుచును
దనబంట్ల బిలిచి యుద్దండకోపమునఁ
గనలుచుఁ బలికె, 'నీకష్టాత్మురాలి
నిందఱుఁ జూడంగ నీక్షణంబునను
బందిఁగాఁ గొనిపోయి పట్టముచుట్టు

---

1. ఆకాశము.

